సాక్షి చిత్తూరు

శుక్రవారం | 14 | మార్చి | 2025



మొల్ల సేవలు అజరామరం

కవయిత్రి మొల్లమాంబ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ నివాళులర్పించారు. - 8లో



బెడిసి కొట్టిన దోపిడీ ప్లాన్

ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కడానికి నగరానికి చెందిన వ్యాపారి దోపిడీకి ప్లాన్ చేసి పోలీసులకు అడ్డంగా దొరికి పోయాడు. - 8లో



కుప్పంలో సింగపూర్ బృందం

కుప్పం మున్సిపాలిటిలో డీపీఆర్ తయారు చేసేందుకు సింగపూర్‌నకు చెందిన కన్సల్టెన్సీ సంస్థ పట్టణంలో పర్యటించింది. - 8లో



న్యూస్‌రీల్

పాలిసెట్ -2025కు దరఖాస్తుల ఆహ్వానం



డా. ఎం. జగన్నాథరావు

కుప్పం రూరల్ : పాలిటిక్నిక్ కోర్సులు అభ్యసించే విద్యార్థులు పాలిసెట్ -2025కు 12వతేదీ నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నట్లు చిత్తూరు జిల్లా పాలిసెట్ కో ఆర్డినేటర్ డా. ఎం. జగన్నాథరావు తెలిపారు. ఏప్రిల్ 15 వరకు దరఖాస్తులు అందజేయవచ్చునని చెప్పారు. పరీక్షలు ఏప్రిల్ 30న ఉంటాయన్నారు. పది పాసైన, పది పరీక్షలు రాసిన విద్యార్థులు ఇందుకు అర్హులుగా తెలిపారు. కుప్పం, పలమనేరు పాలిటెక్నిక్ కళాశాలల్లో లేదా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. ఏప్రిల్ మొదటి వారంలో విద్యార్థులకు కుప్పం కళాశాలలో ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 94903 09037, 99890 64100 నంబర్లను సంప్రదించాలని కోరారు.

17 నుంచి తిరుపతి-కాట్పాడి సర్వీసు

చిత్తూరు కార్పొరేషన్ : కుంభమేళాకు రాయలసీమ నుంచి పలు రైళ్లను మళ్లించిన విషయం తెలిసిందే. ఈనెల 16 వరకు వీటి సేవలను వినియోగించుకోనున్నట్లు రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. 17 నుంచి తిరుపతి-కాట్పాడి ప్యాసింజర్ రైళ్లు అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. ప్యాసింజర్ రైళ్లను అటు మళ్లించడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 8 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 68,509 మంది స్వామివారిని దర్శించుకోగా 23,509 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.86 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

భవితవ్యం అయోమయం



చంద్రబాబు అధికారంలోకి రాగానే ప్రమాణ స్వీకారంలో డీఎస్సీ పోస్టులు భర్తీ చేస్తానని మొదటి సంతకం చేశారు. ఈ సంతకం చేసి పది నెలలు పూర్తి అవుతోంది. అయితే డీఎస్సీ పోస్టుల భర్తీపై అతీగతి లేదు. ముందస్తు కసరత్తులో భాగంగా డీఎస్సీకి శిక్షణ పొందుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ ఇతర అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తామని ఆర్భాటాలు పలికారు. అవన్నీ వట్టిమాటలేనని తేలిపోయింది. తాజాగా డీఎస్సీ శిక్షణకు సంబంధించి ఆన్‌లైన్‌లో ఎంపిక చేసిన కోచింగ్ సెంటర్ల జాబితాను ప్రచురించారు. సీఎం ఇలాక చిత్తూరు జిల్లాలో ఒక్క డీఎస్సీ స్టడీ సెంటర్‌కు అనుమతి ఇవ్వకపోవడంతో నిరుద్యోగులను నట్టేట ముంచినట్లు అయింది. ఇక్కడి అభ్యర్థులకు అనంతపురంలో కోచింగ్ సెంటర్‌ను ఎంపిక చేయడంపై అభ్యర్థులు గగ్గోలు పెడుతున్నారు.

- ఆందోళనలో డీఎస్సీ అభ్యర్థులు
- సీఎం జిల్లాకు కేటాయించని కోచింగ్ సెంటర్
- కూటమి ప్రభుత్వంలో బూటకపు మాటలు
- రాయలసీమకు అంతా ఒకేచోట కోచింగ్
- ముడుపులు ఇచ్చిన వారికి ఆమోదం !





ప్రభుత్వం విడుదల చేసిన కోచింగ్ సెంటర్‌ల జాబితాలో సీఎం సొంత జిల్లాకు లేని చోటు, చిత్తూరులో శిక్షణ పొందుతున్న డీఎస్సీ అభ్యర్థులు

చిత్తూరు కలెక్టరేట్ : సీఎం హోదాలో ఉన్న చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లా చిత్తూరు. ఇది పేరుకు మాత్రమే.. సీఎం సొంత జిల్లాకు ఒరిగిందేమి లేదు. ప్రస్తుతం డీఎస్సీ అభ్యర్థులకు ప్రభుత్వం కుచ్చుటోపి పెట్టింది. డీఎస్సీ పరీక్ష కోసం చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 45 వేలకు పైగా అభ్యర్థులు సన్నద్ధం అవుతున్నారు. ఇందులో పేద అభ్యర్థులకు మంచి కోచింగ్ సెంటర్‌లలో డీఎస్సీ శిక్షణ ఇప్పిస్తామని కూటమి హామీ ఇచ్చింది. ఆ హామీ నెరవేరుస్తారని జిల్లా డీఎస్సీ అభ్యర్థులు ఎదురుచూశారు. పది నెలలుగా ఆ హామీ మాత్రం నెరవేరలేదు. తాజాగా సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న చిత్తూరు జిల్లాలో ఒక్క కోచింగ్ సెంటర్‌కు సైతం డీఎస్సీ శిక్షణకు అనుమతి ఇవ్వకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఈ వ్యవహారంపై డీఎస్సీ అభ్యర్థులు, తల్లిదండ్రులు, విద్యావేత్తలు, విద్యార్థి సంఘాలు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నాయి.

దరఖాస్తు చేసుకున్నా..

చిత్తూరు జిల్లా కేంద్రంలో డీఎస్సీ శిక్షణ ఇచ్చేందుకు అర్హత ఉన్న కోచింగ్ సెంటర్ ఉన్నప్పటికీ...ఆ శిక్షణ సంస్థ దరఖాస్తులు చేసుకున్నా మంజూరు చేయకుండా ఆపేశారు. పోతేపోని జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో వేరే కోచింగ్ సెంటర్‌లకు అనుమతులిచ్చారా అంటే అదీ లేదు.

ఉచిత కోచింగ్ పేరుతో నమ్మించి మోసం

జిల్లా వ్యాప్తంగా డీఎస్సీకి శిక్షణ పొందుతున్న పేద అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తామని హామీ ఇచ్చారు. ఇందులో ఒక్కో అభ్యర్థికి రూ.28 వేలు శిక్షణ రుసుం చెల్లిస్తామని చెప్పారు. అయితే ప్రస్తుతం జిల్లాలో ఒక్క కోచింగ్ సెంటర్‌కు సైతం అనుమతివ్వకుండా మోసగించారు.

పక్క జిల్లాల్లో పోలీస్ ఉద్యోగాలకు కోచింగ్ ఇచ్చే పలు సెంటర్‌లకు డీఎస్సీ శిక్షణకు అనుమతులివ్వడంపై నిరుద్యోగులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. డీఎస్సీ నిరుద్యోగులకు ప్రయోజనం చేకూర్చేలా కోచింగ్ సెంటర్‌లను ఎంపిక చేయకుండా ఆమ్యామ్యాలకు కక్కుర్తి పడి అనుభవం లేని కోచింగ్ సెంటర్‌లకు అనుమతులివ్వడం విమర్శలకు తావిస్తోంది. ఈ వ్యవహారం కూటమి టీడీపీ ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వ లింకుడ్ కోచింగ్ సెంటర్ల పేరుతో జరుగుతున్న మాయాజాలమని తెలుస్తోంది.

రాయలసీమలో ఒకే ఒక కేంద్రం ఎంపిక

రాయలసీమ పరిధిలో ఒకే ఒక శిక్షణ కేంద్రాన్ని కూటమి ప్రభుత్వం ఎంపిక చేసింది. అనంతపురం జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేట్ శిక్షణ కేంద్రాన్ని ఎంపిక చేస్తున్నట్లు రాష్ట్ర అధికారులు ప్రకటించారు. ఆ కేంద్రానికి చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, వైఎస్సార్ కడప, ఇతర జిల్లాల నుంచి డీఎస్సీ అభ్యర్థులు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

డీఎస్సీ పరీక్షకు సన్నద్ధమవుతున్న అభ్యర్థుల్లో ఎక్కువ మంది మహిళలున్నారు. మహిళలు అంత దూరం వెళ్లి శిక్షణ పొందాలంటే శ్రమతో కూడుకున్న పని అని వాపోతున్నారు. సీఎం తన సొంత జిల్లాతో పాటు, రాయలసీమలోని డీఎస్సీ అభ్యర్థుల ఆశలపై నీళ్లు చల్లారు.

లక్ష్యాన్ని నీరుగార్చి.. నిబంధనలకు నీళ్లు

కూటమి టీడీపీ ఇచ్చిన మాటను తప్పి డీఎస్సీ అభ్యర్థుల జీవితాలతో ఆటలాడుతోంది. ప్రభుత్వం తరఫున కోచింగ్ ఇవ్వాలంటే కనీసం రెండు నోటిఫికేషన్‌లు కోచింగ్ ఇచ్చి, జీఎస్టీ ఏటా చెల్లించన వారై ఉండాల్సి ఉంటుంది. అదే విధంగా సంవత్సరానికి రూ.50 లక్షల టర్నోవర్ ఉండి కనీసం ఒక్కో నోటిఫికేషన్‌లో వంద మంది ఉండాలనే నిబంధన ఉంది. ఈ నిబంధనలకు అర్హత ఉన్న కోచింగ్ కేంద్రం జిల్లా కేంద్రంలో ఉన్నప్పటికీ ఎంపిక చేయకుండా ముడుపులు ఇవ్వలేదనే కారణంతో పక్కన పెట్టేశారు.

డీఎస్సీ శిక్షణకు ఆప్షన్‌లు నమోదు చేసుకోండి

చిత్తూరు కలెక్టరేట్ : డీఎస్సీ శిక్షణకు అభ్యర్థులు ఆప్షన్‌లు ఎంపిక చేసుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చెన్నయ్య తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ అధికారుల ఆదేశాల మేరకు జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ డీఎస్సీ అభ్యర్థులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఉచిత వసతి, భోజన సదుపాయంతో డీఎస్సీ శిక్షణ ఇస్తారన్నారు. అభ్యర్థుల నమోదు ప్రక్రియ పూర్తి కావడంతో 1000 మంది అభ్యర్థుల షార్ట్ లిస్టును విడుదల చేశారన్నారు.

సంబంధిత అభ్యర్థులు ఎంపానెల్డ్ కోచింగ్ సంస్థల్లో వెబ్ ఆప్షన్‌లను నమోదు చేసుకోవాలన్నారు. ఎంపికైన అభ్యర్థులు జ్ఞానభూమి పోర్టల్‌లోని www.mdfc.apcfss.in లో ఈ నెల 15వ తేదీలోపు ఆప్షన్‌లు నమోదు చేసుకోవాలని కోరారు.

సీఎంకు చిత్తూరు గుర్తు లేదా..



సీఎం సారుకు చిత్తూరు జిల్లా గుర్తు లేదా.. ప్రభుత్వం తరపున శిక్షణ ఇస్తారని ఎదురు చూస్తూనే ఉన్నాం. ఇంత వరకు అతీగతి లేదు. ఇదిగో ఇస్తారు... అదిగో ఇస్తారని పది నెలలుగా చెబుతూనే ఉన్నారు. చివరికి చిత్తూరు జిల్లాలో శిక్షణ కేంద్రమే లేకుండా చేశారు. ఇది న్యాయమా అని ప్రశ్నిస్తున్నారు. - మునికుమార్, డీఎస్సీ అభ్యర్థి

జిల్లాపై చిన్నచూపెందుకు...



కూటమి ప్రభుత్వానికి చిత్తూరు జిల్లాపై చిన్నచూపెందుకో అర్థం కావడం లేదు. డీఎస్సీకి శిక్షణ ఇచ్చేందుకు అర్హత ఉన్న కేంద్రం చిత్తూరులో ఉన్నప్పటికీ ఎంపిక చేయలేదు. పోతే పోని వేరే కేంద్రాలు జిల్లాలో ఎక్కడైనా ఎంపిక చేశారా అంటే అదీ లేదు. ఇదెంత వరకు న్యాయమని అడుగుతున్నాం. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం చిత్తూరు జిల్లా కేంద్రంలో కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలి.

- జయకుమార్, డీఎస్సీ అభ్యర్థి

విడ్డూరంగా ఉంది



డీఎస్సీ శిక్షణ పొందుతున్న వారిలో చిత్తూరు జిల్లాలో అధిక శాతం మంది మహిళలున్నారు. చిత్తూరు జిల్లా కేంద్రంలో శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తారని అనుకున్నాం. అయితే చివరికి శిక్షణ కేంద్ర మే లేకుండా చేశారు. మహిళలు అనంతపురానికి వెళ్లి శిక్షణ ఎలా పొందేది. డీఎస్సీ నిరుద్యోగులకు అన్యాయం చేసేలా నిర్ణయాలు తీసుకోవడం సరైన పద్ధతి కాదు. జిల్లా కేంద్రంలో అనుభవం ఉన్న కోచింగ్ సెంటర్‌కు అనుమతి ఇచ్చి శిక్షణ ఇప్పించాలని డిమాండ్ చేస్తున్నాం.

- ఉమామహేశ్వరి, డీఎస్సీ అభ్యర్థిని

స్థానికంగా ఏర్పాటు చేయాలి



కూటమి టీడీపీ ప్రభుత్వానికి చిత్తూరు జిల్లా అంటే అలుసెందుకో అర్థం కావడం లేదు. ఉన్నతాధికారులకు ఆ మాత్రం క్షేత్ర స్థాయి పరిస్థితులు తెలియవా. రాయలసీమ మొత్తానికి ఒక శిక్షణ కేంద్రం. అదీ అనంతపురంలో ఎంపిక చేయడం విడ్డూరంగా ఉంది. ఇదంతా చూస్తుంటే డీఎస్సీ అభ్యర్థులపై కక్ష సాధింపు దిశగానే చేస్తున్నారనిపిస్తోంది. ప్రభుత్వం చిత్తూరు జిల్లా కేంద్రంలో శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసి శిక్షణ మొదలుపెట్టాలని డిమాండ్ చేస్తున్నాం.


- కోమల, డీఎస్సీ అభ్యర్థిని

కర్షక గుండెకోత

కరెంటు లేకపోవడంతో బాధపడుతున్న రైతు



తోటకనుమ సబ్‌స్టేషన్‌లో ఉన్న ఒకటే ట్రాన్స్‌ఫార్మర్



కర్షకులకు జీవనం నిత్యం పరీక్షగా మారుతోంది. అనధికారిక విద్యుత్ కోతలు.. ఎప్పుడు ఎంత సమయం ఆగిపోతుందో తెలియని దుస్థితితో కంటి మీద కునుకు లేకుండా పోతోంది. దీంతో ఆశల పంట తడారిపోకుండా జీవ'తడులు' ఇచ్చుకునేందుకు నానా అగచాట్లు పడుతున్నారు. అడిగినా సమాధానం చెప్పే అవసరం లేదన్న ధీమాతో కూటమి సర్కారు పుడమి పుత్రుల కష్టం.. పంట భవితవ్యంతో చెలగాటమాడుతోంది. హలధారులకు విద్యుత్ సరఫరాలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ప్రభుత్వంతోపాటు అధికారుల అలసత్వంతో అన్నదాతల ఆ'శని'పాతంగా మారుతోంది. ఫలితంగా కర్షకుడికి గుండెకోత మిగులుతోంది.

అనధికార విద్యుత్ కోతలు.. రైతులకు వాతలు

- గంటకోసారి విద్యుత్ సరఫరా ఆపివేత
- అధికారులపై రైతుల కన్నెర్ర
- పట్టించుకోని ప్రభుత్వం

వి.కోట: బైరెడ్డిపల్లి-వి.కోట మండలాలకు శాశ్వతంగా లోవోల్టేజ్ సమస్యకు చరమగీతం పాడాలన్న సంకల్పంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మండలంలో తోటకనుమ గ్రామం వద్ద 132/33 కేవీ సబ్‌స్టేషన్‌ను నిర్మించింది. ప్రస్తుత పాలకులు తామే గొప్ప అని ఆ సబ్‌స్టేషన్‌ను ఆడంబరంగా ప్రారంభించారు. సరఫరా మొదలైంది. అన్నదాతల్లో ఆశలు చిగురించాయి. ఏళ్ల తరబడి ఎదుర్కొంటున్న సమస్యకు అడ్డు కట్టపడిందని సంబరపడ్డారు. అది కాస్త మూన్నాళ్ల ముచ్చటగా మిగిలింది. కేవలం మూడు నెలలు మాత్రమే విద్యుత్ సరఫరా కొనసాగింది. ఫిబ్రవరిలోనే అనధికారిక కోతలు మొదలయ్యాయి. సబ్‌స్టేషన్‌లో 31.5 మెగావాట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతో 24 మెగావాట్ల విద్యుత్ లోడ్ వినియోగించుకోవచ్చు. దీని నుంచి వి.కోట మండలంలో 7 సబ్‌స్టేషన్లకు విద్యుత్ సరఫరా ఇవ్వాల్సి ఉంది. అలాగే కస్తూరినగరం, వి.కోట. పాపేపల్లిమిట్ట, యాలకల్లు, పాముగానిపల్లి తదితర 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా చేయాల్సిఉంది. అలాగే బైరెడ్డిపల్లి మండలంలో 6 సబ్‌స్టేషన్లకు తోటకనుమ నుంచి సరఫరా అందిస్తున్నారు. ఇందులో బైరెడ్డిపల్లి, తీర్థం, కడపనత్తం, తదితర మూడు సబ్‌స్టేషన్లకు సరఫరా ఇచ్చారు. ఫలితంగా రైతులకు 7 గంటలు ఉచిత విద్యుత్ సరఫరా అందించాలి. ఇందులో పగటిపూట 4 గంటలు, రాత్రి పూట నిరంతరాయంగా అందించాల్సి ఉంది. అయితే ఫిబ్రవరి నెల నుంచే అనధికారిక కోతలు మొదలయ్యాయి.

ఒకే ట్రాన్స్‌ఫార్మర్‌తో అగచాట్లు

సబ్‌స్టేషన్‌లో ఒకే ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో అధిక లోడ్డు కారణంగా బ్రేకర్ పడిపోతోంది. దీంతో విద్యుత్ సిబ్బంది కోతలకు సిద్ధమయ్యారు. రెండు ఫీడర్లకు సరఫరా ఇవ్వాల్సి వచ్చినప్పుడు ఒక ఫీడర్ లో ఒక గంట సమయం విద్యుత్ సరఫరా ఆపివేస్తున్నారు. అనంతరం మరో ఫీడర్‌కు విద్యుత్ సరఫరా నిలిపేసి, మరో ఫీడర్‌కు విద్యుత్ పునరుద్ధరిస్తున్నారు. ఇలా అనధికారిక కోతలు విధిస్తున్నారు. ఈ అనధికారిక కోతలు పంటలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. రైతుల కోసం ప్రభుత్వం నిర్దేశించిన ఏడు గంటల విద్యుత్ అందడం లేదు. దీంతో సబ్‌స్టేషన్‌కు రైతులు ఫోన్ చేసి, అధికారులను నిలదీసినా సమాధానం దొరకడం లేదు.

కర్షకులకు ఇక్కట్లు

వేసవి ప్రారంభంలోనే అనధికారిక కోతలు విధిస్తున్నారు. దీంతో కర్షకులు ఇక్కట్లు పడుతున్నారు. పంటలకు నీరందక ఎండిపోతున్నాయి. ఇప్పుడే ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలల్లో పంటల పరిస్థితి ఏమిటని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో 31.5 మెగావాట్ల విద్యుత్ సరఫరాకు అనువుగా రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే వీటి ఏర్పాటుపై కూటమి ప్రభుత్వం కానీ, అధికారులు కానీ దృష్టి సారించడం లేదు. ఫలితంగా నిత్యం ఉన్న ఒక్క ట్రాన్స్‌ఫార్మర్ బ్రేకర్ పడిపోతోంది. దీంతో పంటలకు నీరందకుండాపోతోంది.

అధికారుల కాలయాపన

మంజూరు చేశాం.. విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెప్పుకుంటున్న పాలకులు ఎటుపోయారని రైతులు నిలదీస్తున్నారు. నాణ్యమైన విద్యుత్ అందిస్తామని చెప్పిన మాటలు నీటిమూటలుగా మిగిలాయని రైతులు ఆరోపిస్తున్నారు. విద్యుత్ సరఫరాపై ఉన్నతాధికారులకు నివేదికలు పంపామంటూ స్థానిక అధికారులు కాలయాపన చేస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఏపీ ఎస్పీడీసీఎల్ ఉన్నతాధికారులు తక్షణమే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పంట ఎండిపోతోంది




కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులకు నిరంతరాయంగా తొమ్మిది గంటలు ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం పగలు 5 గంటలు, రాత్రి పూట రెండు గంటలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. ఇలాంటి కరెంటు కోతలతో రైతులు పంటలను పండించడం అటుఉంచితే, చేతికొచ్చిన పంటలకు సమయానికి నీరు అందించలేక, పంటలను ఎండిపోతోంది. ఎండుతున్న పంటలను చూస్తే గుండె పిండేస్తుంది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు రైతులకు నిరంతరాయంగా 9 గంటలు కరెంటు ఇవ్వాలి.

- రమేష్, రైతు, దాసార్లపల్లి గ్రామం, వి.కోట

కుప్పంలోనూ ఏడు గంటలే !

శాంతిపురం: సీఎం చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలోనూ రైతులకు కరెంటు కష్టాలు తప్పడం లేదు. వ్యవసాయానికి ఏడు గంటల పాటు విద్యుత్ ఇస్తున్నట్లు అధికారులు చెబుతున్నా.. వాస్తవంలో సరఫరా ఆరు నుంచి 6.30 గంటలకు మించటం లేదు. తెల్లవారుజామున 3 గంటల నుంచి 5 వరకూ అన్ని ఫీడర్లలో త్రీఫేజ్ సరఫరా ఇస్తున్నారు. తర్వాత ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఓ ఫీడర్‌లో, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 6 వరకూ మరో ఫీడర్లో సరఫరా ఇస్తున్నారు. ఏకధాటిగా ఐదు గంటల పాటు విద్యుత్ ఉంటున్న సమయంలో కనీసం అర గంటకు తగ్గకుండా అప్రకటిత విద్యుత్ కోత అమలవుతోంది. దీంతో తమ పంటలు ఎండిపోకుండా చూసేందుకు రైతులు ఆపసోపాలు పడుతున్నారు. దండికుప్పం పంచాయతీలోని నిమ్మనపల్లెకు చెందిన రైతు 30 సాన్నేగానిపల్లి వద్ద పొలం లీజుకు తీసుకుని దాదాపు 3.5 ఎకరాల్లో బంగాళాదుంప సాగు చేశారు. కరెంటు కోతలతో నీరు ఇవ్వలేని స్థితిలో ఆ రైతు జనరేటర్‌ను ఏర్పాటు చేసుకుని పంటను కాపాడుకుంటున్నాడు.



జనరేటర్ సాయంతో కాపాడుకుంటున్న బంగాళాదుంప పంట

మహిళల రక్షణకే 'శక్తి' బృందాలు



మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్ : మహిళలు, బాలికలపై నేరాలు జరగకుండా ఉండేందుకు, ముందస్తు అప్రమత్తం చేయడానికి జిల్లా వ్యాప్తంగా 'శక్తి' బృందాల ఏర్పాటుపై అధికారులు దృష్టి సారించాలని చిత్తూరు ఎస్పీ మణికంఠ ఆదేశించారు. గురువారం చిత్తూరు నగరంలోని జిల్లా పోలీసు శిక్షణా కేంద్రంలో పోలీసు అధికారులతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ.. గ్రామాలు, పట్టణాల్లో మహిళలను చైతన్యం చేయడానికి శక్తి బృందాలను ఉపయోగించుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసుల విషయాల్లో నిర్లక్ష్యం వద్దని, దర్యాప్తు పూర్తి చేసి కోర్టుకు ఛార్జ్‌షీట్ సమర్పించాలన్నారు. ఇదే సమయంలో నేరం చేసిన నిందితులకు శిక్ష పడేలా దర్యాప్తు ఉండాలన్నారు. గంజాయి, ఎర్ర చందనం, సారా, ఇసుక స్మగ్లింగ్ చేసే వ్యక్తులపై పీడీ యాక్టులు పెట్టడానికి వెనకాడొద్దని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు నిత్యం వాహనాల తనిఖీలు చేపట్టాలన్నారు. రాత్రి గస్తీలు పెంచాలని, పాత నేరస్తుల కదలికపై నిఘా ఉంచాలన్నారు. సైబర్ నేరాలబారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేస్తూ ఉండాలన్నారు. పోలీసు వాట్సాప్ నంబర్ 94409 00005, సైబర్ మిత్ర 91212 11100 నంబర్లను ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో గతనెల ఉత్తమ ప్రతిభ చూపించిన చిత్తూరు వన్‌టౌన్ సీఐ జయరామయ్య, పుంగనూరు సీఐ శ్రీనివాసులు, కల్లూరు ఎస్ఐ వెంకటేశ్వరులను ఎస్పీ అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. సమావేశంలో ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, పలువురు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐ పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శిగా వెంకటరమణ

తిరుపతి మంగళం : వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి నియోజకవర్గానికి చెందిన టి.వెంకటరమణను చిత్తూరు, తిరుపతి జిల్లాల పార్టీ ఆర్గనైజేషన్ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీచేసింది.

మాతాశిశు మరణాలు కట్టడి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఉషశ్రీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : మాతా శిశు మరణాలను కట్టడి చేసేందుకు వైద్య బృందం సమష్టిగా పని చేయాలని, క్షేత్రస్థాయిలో పర్యటించి గర్భిణుల సేవలను విస్తృతం చేయాలని గైనిక్ వైద్యురాలు ఉషశ్రీ ఆదేశించారు. చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం మాతా శిశు మరణాలపై జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. వైద్య సిబ్బంది ప్రణాళిక ప్రకారం పనిచేయాలన్నారు. వైద్య ఆరోగ్య సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. మాతృ మరణాల నివారణకు వైద్య శాఖ చేస్తున్న సేవలపై గర్భిణులకు అవగాహన కల్పించాలన్నారు. హైరిస్క్ కేసులపై నిర్లక్ష్యం చూపకుండా మెరుగైన వైద్య సేవలను అందించాలన్నారు. మాతృ మరణాల నివారణలో భాగంగా గర్భిణుల సేవల్లో నిర్లక్ష్యం ఉండకూడదని ఉషశ్రీ పేర్కొన్నారు. సమావేశంలో వైద్యులు అనూష, లత, ఐసీడీఎస్ పీడీ ఆయేషా, 108 మేనేజర్ మోహన్‌బాబు పాల్గొన్నారు.

సీనియారిటీ జాబితాలో తప్పిదాలు


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాలాజీ

చిత్తూరు కలెక్టరేట్ : టీచర్ల సీనియారిటీ జాబితాల్లో అనేక తప్పిదాలు చోటు చేసుకున్నాయని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ తెలిపారు. ఈ మేరకు ఆ సంఘ నాయకులు గురువారం రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామ రాజును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అన్ని జిల్లాల్లో సీనియారిటీ లిస్టులు మెరిట్ ప్రాతిపదికన, మెరిట్ కమ్ రోస్టర్ పద్ధతిలోనే తయారు చేయాలన్నారు. ప్రతి జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ నుంచి హెడ్ మాస్టర్ ఉద్యోగోన్నతికి అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్‌ల సీనియారిటీ జాబితాను ప్రచురిస్తారన్నారు. 117 జీఓ రద్దు విషయంలో మోడల్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటు పేరెంట్ కమిటీల ఆధారంగానే ఉంటాయని తెలిపారు. హైస్కూల్ ప్లస్‌లను కొనసాగిస్తారన్నారు. ఎయిడెడ్ నుంచి గవర్నమెంట్, జిల్లా పరిషత్‌లో విలీనం అయిన వారికి విలీనం అయ్యేటప్పుడు అమలు చేసిన ఉత్తర్వుల మేరకే సర్వీస్ వెయిటేజ్ ఇస్తారన్నారు. అంతర్ జిల్లా బదిలీలు, అంతర్ మున్సిపాలిటీ బదిలీలు నిర్వహించాలని కోరినట్లు వెల్లడించారు.

బెడిసికొట్టిన దోపిడీ ప్లాన్

- తాను మునిగి.. అందరినీ ముంచి !
- ఆర్థిక కష్టాల నుంచి బయటపడేందుకు దోపీడీకి యత్నం
- ఉన్నది పోగొట్టుకుని.. కాళ్లు , నడుము విరగొట్టుకున్న వైనం
- సుబ్రమణ్యం నేర చరిత్రపై చిత్తూరు వాసుల ఆశ్చర్యం


ఆపరేషన్‌లో పాల్గొన్న అధికారులను అభినందిస్తున్న ఎస్పీ మణికంఠ, పోలీసులు పట్టుకున్న ప్రధాన నిందితుడు సుబ్రమణ్యం

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరంలోని గాంధీ రోడ్డులో జరిగిన దోపిడీ యత్న ఘటనలో ప్రధాన నిందితుడు సుబ్రమణ్యం విషయం హాట్ టాపిక్‌గా మారింది. ఎందుకంటే చిత్తూరులో సోఫాలు కొనేవాళ్లల్లో 60 శాతం మందికి పైగా ప్రజలు ఏదో ఒకసారి సుబ్రమణ్యం దుకాణానికి తప్పకుండా సందర్శించినవాళ్లే. ప్రజలతో పాటు కొందరు అధికారులు కూడా రెడ్డిగుంట సమీపంలో ఉన్న ఆ దుకాణాన్ని సందర్శించే ఉంటారు. దుకాణానికి వచ్చిన వాళ్లతో 'అన్నా, రా అన్నా, కూర్చోనా...!' అంటూ ఆప్యాయంగా పలకరించడం. అధికారులు ఎవరైనా ఫైనల్ చేసిన బిల్లులో రూ.5 వేలు నుంచి రూ.10 వేల వరకు తగ్గించి తీసుకోవడం ఇతడి నైజం. దీంతో తక్కువ కాలంలో ఇతడి దుకాణం పేరు నగరం మొత్తం పాకింది. ఇదే సమయంలో సోఫాలు చాలా మందికి అప్పులు ఇవ్వడం, పలువురి వద్ద వడ్డీలకు డబ్బులు తీసుకుని సకాలంలో తిరిగి చెల్లించకపోవడంతో సుబ్రమణ్యానికి ఆర్థిక కష్టాలు మొదలయ్యాయి. సంపాదించుకున్న బ్రాండ్‌తోనే వ్యాపారాన్ని విజయవంతం చేయాల్సిన అతను, అదే బ్రాండ్‌ను తాకట్టుపెట్టడంతో వ్యక్తిగతంగా ఇబ్బందులు తప్పలేదు. ఈ దుకాణంలో 50 మందికి పైగా కార్మికులు ప్రతి రోజూ పనిచేస్తుంటారు. వాళ్లకు సక్రమంగా జీతాలు ఇవ్వకపోవడంతో పలువురు దుకాణాన్ని వీడాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ సమయంలో ఆర్థిక కష్టాలను గట్టెక్కడానికి దోపిడీ ప్లాన్ చేసిన సుబ్రమణ్యానికి తరచూ తాను గిఫ్ట్‌లు కొనుగోలు చేసే గాంధీరోడ్డులోని చంద్రశేఖర్ దుకాణం గుర్తుకు వచ్చింది. చంద్రశేఖర్ రోజూ బ్యాంకుకు వెళ్లడం, దుకాణంలోనే రూ.లక్షల విలువైన సరుకు ఉండటంతో ఇంట్లో రూ.కోట్లలో నగదు ఉన్నట్లు గుర్తించిన నిందితుడు దోపిడీకి ప్లాన్ చేశాడు. తన వద్ద పనిచేసే కుర్రాళ్లతో పాటు పాత పరిచయాలున్న వాళ్లను తీసుకొచ్చి దోపిడీకి ప్రయత్నించి పోలీసులకు చిక్కాడు. అయితే సుబ్రమణ్యం గత చరిత్ర తవ్వితీసిన పోలీసులు ఇతనిపై నంద్యాలలో రెండు హత్య కేసులు, నాలుగు దోపిడీ కేసులు ఉండటంపై చాలా మందిని షాక్‌కు గురి చేసింది. పైగా ఓ దోపిడీ కేసులో పదేళ్ల జైలు శిక్ష కూడా అనుభవించాడని తెలియడంతో ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. దోపిడీ యత్నం సమయంలో ఓ భవనం పైనుంచి కిందకు దూకిన సుబ్రమణ్యంకు రెండు కాళ్లు విరగడం, నడుము వద్ద ఎముకలకు బీటలు రావడంతో ఇప్పట్లో కోలుకునే పరిస్థితి కనిపించడంలేదు. నేర చరిత్ర ఉన్న సుబ్రమణ్యం.. తాను మునిగిపోవడంతో పాటు తన వద్ద పనిచేసే వాళ్లను కూడా ముంచినట్లయ్యింది. మరోవైపు నిందితుల వద్ద ఉన్నది బొమ్మ తుపాకులని అప్పటికి తెలియక, మెడపై కత్తులు పెట్టినా ధైర్యంగా సాహసం చేసి నలుగురు నిందితులను నిర్బంధించిన ఉమాపతి అతని స్నేహితులు నిజమైన హీరోలుగా మారారు. ఇదే సమయంలో నిందితుల వద్ద తుపాకులు ఉన్నాయని తెలిసి, బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్లు ధరించి, ఒక భవనం నుంచి మరో భవనంపైకి ఎక్కుతూ.. ఏ నిమిషం ఎలాంటి ఘటన ఎదురవుతుందో తెలియక ఆపరేషన్‌లో పాల్గొన్న పోలీసులను.. ప్రత్యక్ష్యంగా చూసిన ప్రజలు వారి సేవలపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎయిర్ ఇండియా నిర్లక్ష్యంపై కేంద్రమంత్రికి ఫిర్యాదు

పలమనేరు : తమకు టిక్కెట్లున్నప్పటికీ పాట్నా విమానాశ్రయంలో విమానంలో ఎక్కించుకోకుండా వదిలేసి వెళ్లడంపై ఎయిర్ ఇండియా నిర్లక్ష్యంపై పలమనేరు, కుప్పం నియోజకవర్గాలకు చెందిన పలువురు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడుకు రిజిస్టర్ పోస్టు ద్వారా ఫిర్యాదు చేసినట్లు గురువారం తెలిపారు. బెంగళూరుకు చెందిన భగవతి ట్రావెల్ ఏజెన్సీ ద్వారా తాము డబ్బులు చెల్లించామన్నారు. ప్యాకేజీలో భాగంగా కాశి, గయ, ప్రయోగరాజ్, దేవఘడ్ తదితర పుణ్య క్షేత్రాలకు విమానంలో తీసుకెళ్లి తిరిగి విమానంలో బెంగళూరులో దింపేలా ఒప్పందం చేసుకున్నామని తెలిపారు. తిరుగు ప్రయాణంలో ఈనెల 3న తమకు సంబంధించిన టిక్కెట్లతో పాట్నా ఎయిర్‌పోర్టుకు వెళ్లగా తాము 40 మంది ఉండగా కేవలం ఐదుగురిని మాత్రం విమానంలో ఎక్కించుకొని మిగిలిన వారిని వదిలేసి వెళ్లారన్నారు. ఎయిర్ ఇండియా నిర్లక్ష్యం కారణంగా తాము ఎన్నో ఇబ్బందులు పడి సొంత ప్రాంతాలకు రావాల్సి వచ్చిందన్నారు. ప్రయాణికులపై తీవ్రమైన నిర్లక్ష్యం చూపిన ఎయిర్ ఇండియాపై తగు చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదుదారులు కరుణాకర్, గీతారాణి, రవీంద్రనాథ్, శైలజ తదితరులు కోరుతున్నారు.

క్రియేటివిటీ, నైపుణ్యాలతో ఇంజినీర్లకు గుర్తింపు

–జేఎన్‌టీయూ వీసీ సుదర్శనరావు


అకడమిక్ టాపర్‌కు ట్యాబ్‌ను అందిస్తున్న సుదర్శనరావు, అశోకరాజు

నారాయణవనం: క్రియేటివిటీ, నైపుణ్యాలతోనే యువ ఇంజినీర్లకు గుర్తింపు లభిస్తుందని అనంతపురం జేఎన్‌టీయూ వైస్ చాన్స్‌లర్ సుదర్శనరావు పేర్కొన్నారు. పుత్తూరు సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలల 24వ జూబిలేషన్ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పాల్గొన్నారు. ఓపెన్ ఆడిటోరియంలో గురువారం సాయంత్రం జరిగిన వేడుకల్లో ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల కోసం కాకుండా కోడింగ్, డీ–కోడింగ్, ప్రాబ్లమ్ సొల్యూషన్ల మీద పనిచేయలని, పారిశ్రామిక వేత్తలుగా ఎదనాలని పిలుపునిచ్చారు. సెమీ కండక్టర్ టెక్నాలజీ, నిర్మాణ, విద్యుత్ రంగాల్లో స్టార్టప్ ప్రాజెక్ట్‌లపై దృష్టి సారించాలని చెప్పారు. కళాశాలల చైర్మన్ డాక్టర్ అశోకరాజు మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు, యోగా, ధ్యానంపై దృష్టి పెట్టి మానసికంగా ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. అకడమిక్ టాపర్లకు మెడల్స్, సర్టిఫికెట్లను అందజేశారు. దక్షిణాది సినీ నటి సంయుక్తా మీనన్ ఆటల పాటలతో అలరించారు. యాంకర్ భానుశ్రీ తన మాట తీరుతో ఆకట్టుకున్నారు. ఇంజినీరింగ్ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఉర్రూతలూగించాయి.

విద్యుత్ షాక్‌తో లైన్‌మెన్ మృతి



వినాయక (ఫైల్)

పాలసముద్రం : మండలంలోని తొలికండ్రిగ దళితవాడకు చెందిన వినాయకం(44) గురువారం విద్యుత్ షాక్ కొట్టి మృతి చెందాడు. వివరాలు ఇలా..మండలంలోని తొలికండ్రిగ దళితవాడకు చెందిన వినాయకం తమిళనాడు పళ్లిపట్టులో విద్యుత్ శాఖలో లైన్‌మెన్‌గా పనిచేస్తున్నారు. పళ్లిపట్టు పట్టణ పంచాయతీలోని కార్యాలయం ముందు ఉన్న విద్యుత్ స్తంభంపై తీగలు మరమ్మతు చేస్తుండగా అకస్మాత్తుగా విద్యుత్ షాక్ కొట్టి స్తంభంపై నుంచి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బంధువులు పళ్లిపట్టు చేరుకుని మృతదేహాన్ని తొలికండ్రిగకు తీసుకొచ్చి అంత్యక్రియలు చేపట్టారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పశువైద్యశాఖ గ్రామ సహాయకురాలు ఆత్మహత్యాయత్నం

గుడుపల్లె : మండలంలోని పొగురుపల్లి గ్రామ సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న పశువైద్యశాఖ గ్రామ సహాయకురాలు జ్ఞానశ్రీ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా.. పొగురుపల్లి గ్రామంలో ఇటీవల టీడీపీ మండల నాయకుడి బంధువులకు గోకులం షెడ్‌లు ఇవ్వాలని ఆమెపై ఒత్తిడి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో ఒత్తిడి తాళలేక మనస్తాపానికి గురైంది. దీంతో బుధవారం రాత్రి పురుగు మందు తాగి జ్ఞానశ్రీ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. తృటిలో ప్రాణాపాయం తప్పింది. ప్రస్తుతం జ్ఞానశ్రీ పీఈఎస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. మండలంలోని టీడీపీ నాయకుల ఒత్తిళ్లే జ్ఞానశ్రీ ఆత్మహత్యాయత్నానికి కారణమని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

'మా కుటుంబాన్ని ప్రభుత్వం వేధిస్తోంది'


విలేకరులతో మాట్లాడుతున్న సర్దార్‌బాషా కుటుంబ సభ్యులు

కుప్పంరూరల్ : మా కుటుంబాన్ని కూటమి ప్రభుత్వం వేధిస్తోందని వైఎస్సార్ సీపీ కుప్పం నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు సర్దార్ బాషా ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం తన నివాసంలో తమ కుటుంబానికి జరిగిన అన్యాయాన్ని వివరించారు. టీడీపీలో చేరాలని ఒత్తిళ్లు ఎక్కువ అయ్యాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో షాదీమహల్ మరమ్మతులకు చేసిన రూ.21 లక్షలు ఖర్చు చేసినా ఇప్పటి వరకు ఇవ్వకుండా వేధిస్తున్నారన్నారు. తన కుమార్తె రేష్మాభాను కుప్పం మున్సిపాలిటీలోని మెప్మాలో సంఘమిత్రగా పని చేస్తోందని, ఆమెను తొలగించాలని అనేక రకాలుగా కూటమి నాయకులు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. తాను గత ఆగస్టులో కోర్టుకు వెళ్లి స్టే తెచ్చినా.. కోర్టు ఆదేశాలను ధిక్కరించి సీవో జగదీష్ అనేక రకాలుగా ఒత్తిళ్లు తెస్తున్నారని వాపోయారు. గ్రూపు సమావేశాల్లో మహిళా సభ్యులంతా ఏకతాటిగా రేష్మాభానునే సంఘమిత్రగా కొనసాగాలని తీర్మానించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. తాను ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గేది లేదని, తాను అధినేత జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వెంటే నడుస్తానని తెగేసి చెప్పారు. అధికారులు, నాయకులు ఒత్తిళ్లు ఆపకపోతే తగిన రీతితో జవాబు ఇస్తామని హెచ్చరించారు.

ఇళ్ల నిర్మాణాల పురోగతిలో అలసత్వం వద్దు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : ఇళ్ల నిర్మాణాల పురోగతిలో అలసత్వం వద్దని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్‌లో హౌసింగ్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ ఇళ్ల నిర్మాణానికి అదనంగా 50 వేల నుంచి లక్ష వరకు అందిస్తున్న ప్రభుత్వ ఆర్థిక సహాయంపై అవగాహన పెంచాలన్నారు. ఇళ్ల నిర్మాణాల పనుల్లో పురోగతి ఉండేలా హౌసింగ్ అధికారులు పని చేయాలని ఆదేశించారు. జిల్లాలో 17,898 మంది లబ్ధిదారులకు రూ.119.65 కోట్లు లబ్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టే లబ్ధిదారులకు అవగాహన కల్పించి వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయించేలా చర్యలు చేపట్టాలన్నారు. అదనపు సాయం పొందేందుకు బేస్‌మెంట్ స్థాయిలో ఏఈ, రూఫ్ లెవల్ స్థాయిలో డీఈలు బాధ్యత తీసుకుని ఇళ్ల నిర్మాణాలకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈనెల 15వ తేదీ నుంచి 23 వరకు క్షేత్ర స్థాయిలో లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సాయంపై అవగాహన చేపట్టాలన్నారు. గృహ నిర్మాణాల్లో చివరి దశకు రావాలంటే ఫ్లోరింగ్, కిటికీలు, తలుపులు, ఇంటి బయట, లోపల పెయింటింగ్ మిగిలిన స్థాయిల్లో పూర్తి చేయాలన్నారు. మండలాల వారీగా ఎంపీడీవోలు, హౌసింగ్ అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రణాళికతో ఇళ్ల నిర్మాణాల పురోగతికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ గోపాల్‌నాయక్, మున్సిపల్ కమిషనర్‌లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

కవయిత్రి మొల్ల సేవలు అజరామరం

చిత్తూరు కలెక్టరేట్ : కవయిత్రి మొల్ల సేవలు ఎనలేనివని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా మొల్ల చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. వాల్మీకి రచించిన రామాయణాన్ని సంస్కృతం నుంచి సరళంగా అందరికీ అర్థమయ్యే రీతిలో తెలుగు భాషలోకి అనువదించిన తొలి తెలుగు మహిళా కవయిత్రి మొల్ల అని అన్నారు. రామాయణాన్ని కేవలం 5 రోజుల్లో సంస్కృతం నుంచి 6 కాండాలతో 871 పద్యాలతో తెలుగులోకి అనువదించారన్నారు. మొల్లపై పోతన కవితా ప్రభావం ఎక్కువగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ డీడీ రబ్బానిబాషా, కలెక్టరేట్ ఏవో కులశేఖర్, సీపీవో సాంబశివారెడ్డి, కుమ్మర శాలివాహన జిల్లా అధ్యక్షులు దామోదరం, రాష్ట్ర కార్యదర్శి దేవరాజులు తదితరులు పాల్గొన్నారు.

పుట్టిన రోజే.. ఆఖరి రోజు

- కబళించిన కరెంటు తీగలు
- అక్కడికక్కడే యువకుడు దుర్మరణం
- వేటగాళ్ల పనేనా లేక రైతు అనాలోచిత నిర్ణయమా!


శరీర భాగాలు కాలిపోయి ఘటనా స్థలంలోనే దుర్మరణం చెందిన కార్తీక్, (ఇన్‌సెట్)కార్తీక్ (ఫైల్)


చికిత్స పొందుతున్న యుగంధర్, పొలం వద్ద బీరు బాటిళ్లకు లాగిన కరెంటు తీగలు

గంగవరం : పుట్టిన రోజే ఓ యువకుడికి ఆఖరి రోజు అవుతుందని ఊహించలేకపోయాడు. పొలాల వద్ద లాగిన కరెంటు తీగలు మృత్యువు రూపంలో కబళించాయి. ఘటనా స్థలంలోనే దుర్మరణం చెందాడు. ఈ ఘటన గంగవరం మండలంలోని కొత్తపల్లి, మేలుమాయి సరిహద్దు పొలాల వద్ద బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, అటవీశాఖ అధికారుల కథనం మేరకు.. మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన యువకుడు కార్తీక్ (22) డిగ్రీ కోర్సును మధ్యలో ఆపేసి గ్రామంలోనే కూలి పనులకు వెళ్తున్నాడు. అయితే బుధవారం రోజున అతని పుట్టిన రోజు కావడంతో గ్రామంలో తోటి స్నేహితులు యుగంధర్, చరణ్, అజయ్‌తో కలిసి గ్రామంలోని రైతు సేవా కేంద్రం ఎదుట రాత్రి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అంతటితో తమ ఇళ్లకు వెళ్లిపోకుండా ఊరికి సమీపంలోని మేలుమాయి రెవెన్యూకు సంబంధించిన పొలాల వద్దకు ఎందుకనో వెళ్లారంటూ గ్రామస్తులు చెబుతున్నారు. కొందరు ఆవు తప్పిపోవడంతో వెతకడం కోసం వెళ్లారని, మరికొందరేమో టెంకాయల కోసం వెళ్లారంటూ.. ఒక్కొరు.. ఒక్కోరకంగా చెబుతున్నారు. అయితే తామెందుకు వెళ్లారనే వాస్తవాలు వెలికిరాలేదు. ఇదిలా ఉండగా కార్తీక్‌తో పాటు తన స్నేహితులు అందరూ కలిసి పొలాల వద్దకు వెళ్లగానే అక్కడి పొలంలో లాగిన కరెంటు తీగల తీవ్రతకు కార్తీక్ శరీర భాగాలు పూర్తిగా కాలిపోయి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. అతడిని కాపాడే క్రమంలో మరో యువకుడు యుగంధర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మిగిలిన యువకులు సురక్షితంగా తప్పించుకున్నారు. జరిగిన విషయాన్ని తోటి స్నేహితులు సెల్‌ఫోన్ ద్వారా కుటుంబీకులకు సమాచారం ఇవ్వగా ఊరి జనంతో పాటు అటవీశాఖ, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి ఎలా జరిగిందనే వివరాలను కార్తీక్ స్నేహితుల ద్వారా తెలుసుకునే ప్రయత్నం చేయగా వాళ్ల నుంచి సరైన సమాధానం రాలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ఏరియా ఆసుపత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేటగాళ్ల పనేనా లేక రైతు అనాలోచిత నిర్ణయమా!

ప్రమాదానికి కారణం వేటగాళ్లు వన్యప్రాణుల వేట కోసం కరెంటు తీగలు లాగడంతో ఈ ప్రమాదం జరిగిందా లేక రైతు తమ పొలంలో పంటను పందుల నుంచి కాపాడుకునేందుకు తన అనాలోచిత నిర్ణయం కారణంగా ఈ ప్రమాదం జరిగిందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఎంబీబీఎస్ ఫలితాల్లో పీఈఎస్ హవా!


పి.శ్రీదీప్తి | పి.ధార్మికశ్రేష్ఠ | ఆస్తాగోయెల్ | ఎం.భవిష్య | పి.లక్ష్మీమానస

గుడుపల్లె : ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ ద్వితీయ సంవత్సరం ఎంబీబీఎస్ పరీక్షా ఫలితాల్లో పీఈఎస్ మెడికల్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారని కళాశాల ప్రిన్సిపల్ హెచ్ఆర్ కృష్ణారావు తెలిపారు. జనవరి–2025లో నిర్వహించిన ద్వితీయ సంవత్సరం ఎంబీబీఎస్ ఫలితాల్లో 91 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. 146 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 133 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. డిస్టింక్షన్ 16, ఫస్ట్ క్లాస్ 67, సెకెండ్ క్లాస్ 50 మంది సాధించారని తెలిపారు. ఇందులో ధార్మిక శ్రేష్ఠ 81%, ఆస్తాగోల్ 80%, లక్ష్మీ మానస 80%, భవిష్యా 80%, శ్రీదీప్తి 80%తో టాపర్లుగా నిలిచారు. టాపర్లుగా నిలిచిన వైద్య విద్యార్థులకు పీ ఈ ఎస్ కళాశాల అధ్యాపకులు అభినందించారు.

వైఎస్సార్‌సీపీ నేతలపై టీడీపీ కార్యకర్తల దాడులు

- దాడిచేసిన వారే బాధితులపై ఫిర్యాదు
- బాధితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- రామకుప్పం పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత

సాక్షి టాస్క్‌ఫోర్స్ : రామకుప్పం మండలం వైఎస్సార్‌సీపీ నాయకులపై గురువారం టీడీపీ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. దాడి చేసిన వారే పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వైఎస్సార్‌సీపీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారం రోజుల క్రితం రామకుప్పంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశంలో మండల కన్వీనర్ బాబు రెడ్డి, పార్టీ సానుభూతిపరుడు సెంథిల్‌కుమార్ కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడారని టీడీపీ నాయకులు తమ పార్టీ నేతలున్న వాట్సాప్ గ్రూపుల్లో పోస్టులు పెట్టారు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం బాబు రెడ్డి మిట్టపల్లి వద్ద వెళుతుండగా అదే గ్రామానికి చెందిన టీడీపీ క్రియాశీలక కార్యకర్త నవీన్ రెడ్డి తన అనుచరులతో కలసి దాడి చేశారు. అనంతరం రాత్రి 8.30 గంటల సమయంలో రామకుప్పంలోని వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు సెంథిల్‌కుమార్ ఇంటిలోకి పెద్ద సంఖ్యలో టీడీపీ కార్యకర్తలు చొరబడి దాడి చేశారు. అనంతరం టీడీపీ నేతలు రాత్రి 9 గంటలకు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తమ నాయకులు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని వైఎస్సార్‌సీపీకి చెందిన బాబురెడ్డి, సెంథిల్ కుమార్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు బాబురెడ్డి, సెంథిల్‌కుమార్‌ను అదుపులో తీసుకుని రామకుప్పం పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. గురువారం రాత్రి రామకుప్పం పోలీస్ స్టేషన్ వద్దకు వైఎస్సార్ సీపీ నాయకులు, టీడీపీ నేతలు చేరుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో పోలీసులు బాబు రెడ్డి, సెంథిల్ కుమార్‌కు కుప్పంలోని డీఎస్పీ కార్యాలయం వద్దకు తీసుకొచ్చారు.

భర్త కుటుంబీకులపై భార్య బంధువుల దాడి


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గణేష్, తల్లి మంగమ్మ

పెద్దపంజాణి : భర్త కుటుంబీకులపై భార్య బంధువులు దాడి చేసి గాయపరిచిన సంఘటన మండలంలోని మాదనపల్లి పంచాయతీ చింతలపల్లిలో గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌హెచ్‌ఓ మురళీరాజు కథనం మేరకు వివరాలు.. మండలంలోని చింతలపల్లి గ్రామానికి చెందిన శంకరప్ప కుమారుడు గణేష్‌కు బైరెడ్డిపల్లి మండలం ఎర్రకదిరేపల్లి గ్రామానికి చెందిన రాజప్ప కుమార్తె జమునతో 5 ఏళ్ల కిందట వివాహమైంది. ఈ క్రమంలో నాలుగు నెలల కిందట జమున తన తమ్ముడికి ఆపరేషన్ అని చెప్పి పుట్టింటికి వెళ్లింది. అప్పటి నుంచి భర్త గణేష్ ఫోన్ చేసినా ఇంత వరకూ అత్తగారింటికి రాలేదు. ఈ నేపథ్యంలో 10వ తేదీ మధ్యాహ్నం జమున బంధువులు కొంత మంది రౌడీలతో చింతలపల్లికి వచ్చి భర్త గణేష్ కుటుంబీకులతో మాట్లాడాలని చెప్పి వారిపై దాడి చేసి గాయపరిచి వెళ్లిపోయారు. ప్రస్తుతం క్షతగాత్రులు పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గణేష్ తండ్రి శంకరప్ప ఫిర్యాదు మేరకు మంజుల, రాజప్ప, లక్ష్మీపతి, ప్రభాకర్, కవిత, సరసమ్మ, వికాస్‌పై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ చెప్పారు.

పలమనేరు కోర్టులో రూ.1.02 కోట్లకు ఐపీ

పలమనేరు : నియోజకవర్గంలోని వీకోటకు చెందిన లక్ష్మీనారాయణ అనే వ్యాపారి రూ.1.02 కోట్లకు స్థానిక కోర్టులో ఐపీ దాఖలు చేసినట్లు గురువారం తెలిసింది. అతడు వీకోటలో వ్యాపారాలు చేస్తూ భారీగా నష్టపోయినట్లు తాను అప్పులు తీసుకున్న 16 మందికి అప్పులు చెల్లించలేనని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై స్థానిక లాయర్ కవిత ద్వారా ఆయన పిటిషన్ దాఖలు చేశారు.

కుప్పంలో సింగపూర్ బృందం

కుప్పం : కుప్పం మున్సిపాలిటీలో డీపీఆర్ సిస్టం తయారు చేసేందుకు సింగపూర్‌నకు చెందిన సుర్బాన్ జూర్జ్ కన్సల్టెన్సీ సంస్థకు చెందిన ఓ బృందం కుప్పంలో పర్యటించింది. మున్సిపాలిటీ పరిధిలోని హరితా రిసార్ట్, జమీందర్ పార్కు, డీకేపల్లి పార్కు, బస్టాండు, ఎన్‌టీఆర్ స్టేడియం, కొత్తపేట మార్కెట్ కాంప్లెక్స్‌తో పట్టణంలో 11 ప్రాంతాలను పరిశీలించారు. వీరి వెంట మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

ముగిసిన విరించి


ముగింపు కార్యక్రమానికి హాజరైన అతిథులు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ ఇందిరా ప్రియదర్శిని వేదికగా గత రెండు రోజుల పాటు సాగిన విరించి–2025 టెక్‌ఫెస్ట్ గురువారం ముగిసింది. స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. సంప్రదాయం, సాంస్కృతికం ప్రతిబింబించేలా వేడుకలు సాగాయి. విద్యార్థినులు ఆటపాటలతో అదగొట్టారు. ముగింపు కార్యక్రమానికి వేదిక్ వర్సిటీ వీసీ సదాశివమూర్తి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. రెండవ రోజు విద్యార్థుల సృజనాత్మక శక్తికి పదును పెట్టే పోటీలను నిర్వహించారు. అనంతరం ముఖ్యఅతిథి చేతుల మీదుగా ప్రతిభకనబరిచిన విద్యార్థులకు బహుమతులందించారు. వీసీ ప్రొఫెసర్ ఉమ, రిజిస్ట్రార్ రజిని, డైరెక్టర్ మల్లికార్జున, అధ్యాపకులు, సుమారు 900మంది విద్యార్థులు పాల్గొన్నారు.